క్లుప్తంగా

వీరాంజనేయుడికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతినగర్‌లో కొలువైన వీర అభయాంజనేయస్వామికి విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. అభిషేకాలు, ఆకు పూజ తదితర పూజా కార్యక్రమాలను విశేషంగా జరిపారు. అన్నదానాన్ని నిర్వహించారు. పల్లకిసేవ, ప్రత్యేక పూజలను సాయంత్రం జరిపారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సునీత

వెంకటాచలం: ర్యాగింగ్‌కు దూరంగా విద్యార్థులు ఉండాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత సూచించారు. యాంటీ ర్యాగింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కాకుటూరు సమీపంలో గల వర్సిటీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడటం చట్ట వ్యతిరేక చర్యనే విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. వర్సిటీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, స్క్వాడ్ నిరంతరం పనిచేస్తాయని చెప్పారు. జూనియర్లతో సఖ్యతగా మెలగాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. ప్రిన్సిపల్ విజయ, ఎస్సై అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన దీపాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన దీపాలని బుచ్చిరెడ్డిపాళెం లైబ్రేరియన్ అల్లాడి నరసింహారావు అన్నారు. పట్టణంలోని లైబ్రేరీలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదట గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్సార్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ విషయం గురించి తెలుసుకోవాలన్నా గ్రంథాలయాలు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు, యువత ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పత్రికలు, వివిధ రకాల పుస్తకాలు చదవడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌కుమార్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు:** స్థానిక లైబ్రేరీలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్సార్ రంగనాథన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం కె.వెంకయ్య మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవిర్భావానికి రంగనాథన్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. గ్రంథాలయ శాస్త్రంలో రంగనాథన్ ప్రవేశపెట్టిన పంచ సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.మురళి తదితరులు పాల్గొన్నారు.

⇨ **కోవూరు:** కోవూరులోని నేతాజీ నగర్‌లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్సార్ రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



కొడవలూరు గ్రంథాలయంలో..



కోవూరు డిగ్రీ కళాశాలలో..

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ముత్తుకూరు(పొదలకూరు): వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించొచ్చని ఏఓ జ్యోత్స్న సూచించారు. మండలంలోని వల్లూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన జరిపిన అనంతరం ఆమె మాట్లాడారు. సేంద్రియ పద్ధతులను పాటిస్తే రైతులకు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. ట్రైకో కార్డ్స్ జిగురు అట్టలను వరి పొలంలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా క్రిమి సంహారక మందులను తగ్గించుకోవచ్చని సూచించారు. పల్లికొండ శీనయ్య, వీఏఏలు శశి, ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ **కోవూరు:** మండలంలోని కోవూరు, గంగవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయాధికారిణి జి.అనిత మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. అప్పుడే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని వివరించారు.



పొదలకూరు: మాట్లాడుతున్న జ్యోత్స్న



కోవూరు: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం

కోవూరు: కోవూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం సీతారాముల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. తొలుత సీతారాములను ప్రత్యేకంగా ముస్తాబు చేసి ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చారు. అర్చకులు శ్రీకాంతాచార్యులు, నాగరాజాచార్యులు, సుదర్శనాచార్యులు కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవారిని దర్శించుకుని కల్యాణ ఘట్టాన్ని వీక్షించారు.



నానో యూరియానే వినియోగించండి

పొదలకూరు: యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను రైతులు వినియోగించాలని పొదలకూరు ఏడీఏ శివనాయక్ సూచించారు. పొదలకూరులో ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నానో యూరియా వాడటం ద్వారా పైరుకు మేలు జరుగుతుందని చెప్పారు. అధిక శాతం నత్రజని వినియోగంతో రైతులకు ఆర్థిక భారంతో పాటు చీడపీడలు ఎక్కువవుతాయని చెప్పారు. ఏఓ ప్రతాప్, హెచ్ఓ ఆనంద్, సొసైటీ డైరెక్టర్ మల్లికార్జున్, వీఏఏలు కౌసల్య, శ్రీకర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివనాయక్

ప్రత్యేక విద్యుత్ అదాలత్ నేడు

పొదలకూరు: స్థానిక సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను బుధవారం సాయంత్రం 3.30 నుంచి 5.30 వరకు నిర్వహించనున్నామని డీఈ సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొదలకూరు, రాపూరు, నెల్లూరు రూరల్, ముత్తుకూరు సబ్ డివిజన్ల పరిధిలోని మండలాల వినియోగదారులు హాజరుకావొచ్చని చెప్పారు. సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఎస్‌ఈ విజయన్ తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

హిటాచీ డ్రైవర్ మృతి

రాపూరు: హిటాచీ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని పులిగిలపాడు సమీపంలో గల ఎస్సెల్వీ స్టోన్ క్రషర్స్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. హిటాచీని డ్రైవర్ గుర్రం శ్రీనివాసులు (35) ఆపరేట్ చేస్తుండగా, గుండెపోటుకు గురై డ్రైవింగ్ సీట్లోనే మృతి చెందారంటూ కుటుంబసభ్యులు, బంధువులు, పోలీసులకు క్రషర్ సిబ్బంది సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేశారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

మండలంలో చిరుజల్లులు

ఇందుకూరుపేట: మండల పరధిలో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. తొలుత ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. రెండు మూడు రోజుల పాట వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు చెప్పడంతో రైతులు, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు చేపట్టారు. కాగా సముద్రంలో అలలు సాధారణంగా ఉండడంతో మైపాడు బీచ్‌కు పర్యాటకుల రాక కొనసాగింది.



మైపాడు బీచ్‌లో మేఘావృతమై ఉన్న ఆకాశం

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

కోవూరు: మండలంలోని పడుగుపాడులో ఉన్న ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏపీపీటీడీ నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ నాన్ ఆపరేషనల్ కార్యదర్శి యల్లయ్య మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు తక్షణమే చెల్లించాలన్నారు. గత నాలుగేళ్లగా నిలిచిపోయిన ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాజుద్దీన్, కె.సుధాకర్‌రావు, ఆదినారాయణరెడ్డి, భానురావు, కేఎస్ రావు, వి.దయాకర్, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ

పొదలకూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవానికి బస్టాండ్‌ను ముస్తాబు చేయనున్నామని వెల్లడించారు. అన్ని హంగులతో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. బీజేపీ నేతలు చినసుబ్రహ్మణ్యం, సురేంద్రబాబు, రవీంద్రబాబు, శివకుమార్, జనార్దన్‌రెడ్డి, వెంకటరమణమ్మ, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.



పూజితకు అభినందనలు




పొదలకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితను మండలంలోని మొగళ్లూరుకు చెందిన నేతలు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా నెల్లూరులో ఆమెను సత్కరించారు. రెడ్డిచర్ల అంకిరెడ్డి, పలుకూరు పెంచలనారాయణరెడ్డి, యనమల శ్రీనివాసులు, ఆకుల గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు డీఎన్నార్ విద్యార్థినులు



పొదలకూరు: శాప్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు పట్టణంలోని తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శైలజ తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో బాలికలను ఎంపిక చేశారు. బాక్సింగ్ పోటీలకు ప్రశంసిని, లీలా, రూప, సల్మా.. వెయిట్ లిఫ్టింగ్‌కు వెంకటసాయిలక్ష్మి, జయశ్రీ, పార్వతి, స్వప్నప్రియ, హనీ, హేమలత ఎంపికయ్యారు. గుంటూరులో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కాగా ఎంపీడీఓ నరసింహారావు, ఎంఈఓ రేణుక, ఫిజికల్ డైరెక్టర్లు దేవి, పార్వతి అభినందనలను తెలియజేశారు.

తెలంగాణ సీఈఐజీగా ఇందుకూరుపేట వాసి



నందకుమార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్(సీఈఐజీ)గా జిల్లాలోని ఇందుకూరుపేట మండలం, పున్నూరు పంచాయతీ మూలపాడు గిరిజన కాలనీకి చెందిన కొమరగిరి నందకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం పలువురు అభినందనలు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నెల్లూరు(అర్బన్): పరిశుభ్రమైన ఆహారం, రక్షిత మంచినీరు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ డాక్టర్ పద్మావతి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ పద్మావతి నగరంలోని పప్పులవీధిలో ఉన్న వైపీఎం మున్సిపల్ పాఠశాలలో మంగళవారం డీఎంహెచ్‌ఓ సుజాతతో కలిసి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. ఆమె మాట్లాడుతూ నులిపురుగులు చేరడం వల్ల పిల్లలకు ఆకలి మందగిస్తుందని, రక్తహీనత వస్తుందన్నా రు. కాగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 5,51,722 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసి 96.82 శాతం విజయవంతం చేశామని డీఎంహెచ్‌ఓ సుజాత తెలిపారు.

• బుజబుజనెల్లూరు శేషు ఇంగ్లిష్ మీడియం పాఠశాలల విద్యార్థులకు పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహగిరి ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.

• కోటమిట్ట ఆరోగ్య కేంద్రంలో డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డీపీఎంఓ రమేష్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్ సిద్దిక్, కో–ఆర్డినేటర్ తిరుపతయ్య పాల్గొన్నారు.

అలరించిన బాలనాగమ్మ నాటకం



కోవూరు: మండలంలోని పాటూరు చెంచమ్మ గిరిజన కాలనీలో చెంచులక్ష్మి గిరిజన కళామండలి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన బాలనాగమ్మ నాటకం అలరించింది. ఈ సందర్భంగా ఆర్గనైజర్ కాకి యానాదయ్య మాట్లాడుతూ తెలుగు భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగిందన్నారు. ఇలాంటి నాటకాలు అరుదుగా జరుగుతాయని, గ్రామీణ కళలు, జానపద నాటకాలను ప్రతిఒక్కరూ ఆదరించాలని కోరారు.

ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

పొదలకూరు: మండలంలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను మంగళవారం అందజేశారు. పొదలకూరులోని విష్ణువర్ధనపురం కాలనీలో మాత్రలను డాక్టర్లు కిరణ్ రిషిత, శ్రీకావ్య మింగించారు.



పొదలకూరులో..

⇨ **మనుబోలు:** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పీహెచ్‌సీ సిబ్బంది అందజేశారు. వైద్యాధికారి ప్రమోద్, సీహెచ్‌ఓ రాజయ్య, పీహెచ్‌ఎన్ జయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు స్నేహలత, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో..

⇨ **ఇందుకూరుపేట:** పిల్లల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం డీవార్మింగ్ డే నిర్వహిస్తోందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి అన్నారు. మండల పరిధిలో జరిగిన నేషనల్ డీవార్మింగ్ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా అన్ని పాఠశాలల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఇటుక బట్టీలు, రొయ్యల గుంతలు తదితర ప్రాంతాల్లో సైతం కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డాక్టర్లు బ్రహ్మేశ్వరనాయుడు, కిషోర్‌కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, వైద్యారోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేటలో..

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

వెంకటాచలం: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక కార్యక్రమాలపై విద్యార్థి దశ నుంచే ఆసక్తి చూపాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్ర, ఎస్సై అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.